
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



చిల్లరతో పనేముంది !
డిజిటల్ నగదు చెల్లింపులు వచ్చిన తర్వాత చిల్లర కష్టాలు తప్పాయి. యూపీఐల ద్వారా నగదు చెల్లింపులు పెరగడమే కారణం.
8లో



పెళ్లి మండపాలకు డిమాండ్
జిల్లాలో ఏ కల్యాణ మండపం చూసినా కళకళలాడుతున్నాయి. సోమవారం నుంచి 20 వరకు వివాహ ముహూర్తాలు ఉన్నాయి.
8లో



అకాల వర్షంతో ఇక్కట్లు
జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం రైతుల గుండెల్లో పరుగులు పెట్టిస్తోంది. కోతల వేళ ఆందోళన కలిగిస్తోంది.
8లో

బీమా.. లేదిక ధీమా!

కూటమి ప్రభుత్వంలో నిలిచిన పథకం

- వది నెలలుగా బాధిత కుటుంబాల ఎదురుచూపులు
- రెట్టింపు సాయం అంటూ ఎన్నికల సమయంలో హామీలు
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా సాయం అందజేత
- 2023-24లో 714 మందికి రూ.9.82 కోట్ల చెల్లింపు



భీమవరం(ప్రకాశం చౌక్): పేద, మధ్యతరగతి కుటుంబానికి చెందిన కుటుంబ యాజమాని చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అందించింది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు, సహజ మరణం పొందితే రూ.లక్ష సాయం అందించి బాధితులను ఆదుకుంది. దీంతో బాధిత కుటుంబ బతుకు దెరువు ముందుకు సాగేది. ఎవరైన వ్యక్తి చనిపోయారని తెలిసిన వెంటనే సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వెంటనే బీమా పథకం క్లయిమ్ కోసం ఆన్‌లైన్ చేసేవారు. ఆన్‌లైన్ చేసిన 21 రోజుల్లో నామినీకి (కుటుంబ సభ్యులు) బీమా సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో జమచేసేవారు. అయితే ఇంతటి ప్రాధాన్యమున్న బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఎన్నికల సమయంలో రెట్టింపు భరోసా అంటూ హామీ ఇచ్చి ఇప్పటికీ పథకం అమలుకు విధివిధానాలు ప్రకటించలేదు.

బీమాకు ఎసరు

కూటమి మేనిఫెస్టోలో చంద్రన్న బీమా కింద సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ పథకం ఊసే ఎత్తడం లేదు. కేవలం పేరు మార్పుతో సరిపెట్టిన సర్కారు అమలు దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో బీమా పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి పాలనలో సహజ మరణం, ప్రమాదవశాత్తూ మరణం పొందిన కుటుంబాల్లో బాధితులకు ఒక్క రూపాయి కూడా అందలేదు. పేదల జీవితాలకు భరోసాగా ఉండే బీమా పథకం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో 800 మంది వరకు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీమా పథకానికి అర్హులైన సుమారు 800 మంది వరకు జిల్లాలో మరణించారు. వీరిలో ప్రమాదవశాత్తు చనిపోయిన వారు 200 మంది వరకు ఉండగా, సహజ మరణం పొందిన వారు 600 మంది ఉన్నారు. ప్రమాదాల్లో శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం పొందిన వారు 200 మంది వరకూ ఉన్నారు. ఆయా కుటుంబాలు బీమా సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నాయి. గత ప్రభుత్వంలో నిబంధనల మేరకు 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు ఉండి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు సహజ మరణం పొందితే రూ.లక్ష, శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.5 లక్షలు, పాక్షిక అంగవైకల్యం పొందితే రూ.2.50 లక్షలు బీమా సొమ్ములు అందించారు.

గత ప్రభుత్వంలో (2023-24) బీమా చెల్లింపు

పశ్చిమగోదావరి జిల్లా

కేటగిరీ	సంఖ్య	సాయం (రూ.కోట్లలో)
ప్రమాదవశాత్తూ మరణించిన వారు	30	1.50
సహజ మరణం పొందిన వారు	266	2.66
మొత్తం	296	4.16

ఏలూరు జిల్లా

కేటగిరీ	సంఖ్య	సాయం (రూ.కోట్లలో)
ప్రమాదవశాత్తూ మరణించిన వారు	37	1.85
సహజ మరణం పొందిన వారు	381	3.81
మొత్తం	418	5.66

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–24 సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 714 కుటుంబాలకు బీమా పరిహారం కింద రూ.9.82 కోట్లు చెల్లించారు. వీరిలో 67 మంది ప్రమాదవశాత్తూ చనిపోయిన వారి కుటుంబాలకు రూ.3.35 కోట్లు, 647 మంది సహజ మరణం పొందిన వారి కుటుంబాలకు రూ.6.47 కోట్ల సాయం అందించారు.

అన్ని వర్గాలకూ ఆరాధ్యుడు అంబేడ్కర్

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



ఆచంటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మోషేన్‌రాజు

పెనుగొండ : దేశంలో అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆరాధ్యుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం ఆచంటలో సర్పంచ్ కోట సరోజిని ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ప్రతిఒక్కరూ జయంతి వేడుకలు నిర్వహించే ఏకైక మహానేత, ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని అన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు నినాదంతో అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించి భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా చరిత్రలో నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ యువనేత చెరుకువాడ నరసింహరాజు(నరేష్) మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడన్నారు. యువకులంతా అంబేడ్కర్ చూపిన మార్గం చదువులో ముందుండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరెళ్ల పురుషోత్తం, మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు, మాల సంఘాల రాష్ట్ర కన్వీనర్ గుమ్మాపు సూర్యవరప్రసాద్, బండి సుందర రామమూర్తి, జిల్లెళ్ల సత్య సుధామా, యాదాల రవిచంద్ర, ఆచంట మండల జేఏసీ కన్వీనర్ కోట వెంకటేశ్వరరావు, బీరా మధు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'గురుకుల' పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఉమాకుమారి

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 93 మందికి 83 మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 206 మందికి 182 మంది పరీక్షలకు హాజరయ్యారు. ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఇంటర్మీడియల్ ప్రవేశ పరీక్షను గురుకులాల జిల్లా సమన్వయాధికారి బి.ఉమాకుమారి, ఐదో తరగతి పరీక్షలను ఎంఈఓ–2 పీఎంకే జ్యోతి పరిశీలించారు.

పుప్పాల, చెరుకువాడల నియామకం శుభ పరిణామం

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సలహాదారుల కమిటీలో జిల్లా నుంచి పుప్పాల వాసుబాబు, చెరుకువాడ శ్రీ రంగనాథరాజులకు అవకాశం ఇవ్వడం, తూర్పుగోదావరి జిల్లా నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డి, తోట త్రిమూర్తులను నియమించడం మంచి పరిణామమని శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతో అనుభవం, నేర్పు, ఓర్పు, ఎత్తుగడలు వేసే సామర్థ్యం ఉన్న వీరి నాయకత్వం పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో ప్రతి వారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం రద్దు చేసినట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించే కార్యక్రమాలను రద్దు చేశామని పేర్కొన్నారు.

ఉపాధి హామీ మేట్ తొలగింపు

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తాల పంచాయతీలో ఉపాధి హామీ పనుల మస్తర్లలో జరుగుతున్న అక్రమాలపై 'సాక్షి'లో ఈనెల 11న ప్రచురితమైన 'సత్తాలలో ఉపాధి సిత్రాలు', అలాగే ఐఎస్ జగన్నాథపురంలో జరుగుతున్న అవకతవకలపై 12న 'తెలంగాణలో ఉన్నా ఉపాధి సొమ్ము జమ' కథనాలకు అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సత్తాలలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న మేట్ నరెడ్ల శ్యామలాదేవిని విధుల నుంచి తొలగించినట్టు ఏపీఓ బిరుదుగడ్డ నాగరాజు తెలిపారు. అలాగే ఐఎస్ జగన్నాథపురంలో జరిపిన విచారణలో ఒకరికి బదులుగా మరొకరు ఉపాధి పనికి వెళుతున్నట్టు చెప్పారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలోని సంగారెడ్డిలో స్థిరపడ్డ పసుపులేటి నరసింహమూర్తి, పావని దంపతులకు బదులుగా ఆయన తల్లిదండ్రులు ఇక్కడ పనికి వెళుతున్నట్టు చెప్పారన్నారు. ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లొచ్చా.. అని అడిగిన ప్రశ్నకు వెళ్లకూడదని ఏపీఓ బదులిచ్చారు. మరి ఇలాంటి అవకతవకలకు పాల్పడుతున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాల్సి ఉంది.

ఆర్థిక సాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): షెడ్యూల్ కులాల అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసినట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సోమవారం నుంచి వచ్చే నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏలూరు జిల్లాకు ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక కింద 1,111 యూనిట్లకు రూ.4644.05 లక్షల పథక విలువతో లక్ష్యాలను కేటాయించారన్నారు. సబ్సిడీగా రూ.1,835.30 లక్షలు, బ్యాంకు రుణాలుగా రూ.2,576.55 లక్షలు, లబ్ధిదారుల వాటాగా రూ.232.20 లక్షల నిర్దేశించారని పేర్కొన్నారు.

అలరించిన గానామృతం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన శ్రీ లక్ష్మీ నారాయణ భజన సంఘం వారు నిర్వహించిన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ గానామృతం అలరించింది. ముందుగా ఆలయ అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ శ్రీవారి కల్యాణ గానామృతాన్ని నిర్వహించారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకువద్దాం

మాజీ ఎమ్మెల్యే వాసుబాబు పిలుపు



ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వాసుబాబును సత్కరించిన పార్టీ శ్రేణులు

గణపవరం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో కీలకమైన పీఏసీ కమిటీ సభ్యుడిగా నియమించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడతానని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం క్యాంపు కార్యాలయానికి వచ్చి వాసుబాబుకు అభినందనలు తెలిపారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ పార్టీకి ప్రజల్లో అభిమానం ఏమాత్రం తగ్గలేదని, జగన్ పర్యటనలకు వెల్లువెత్తుతున్న ప్రజాదరణే ఇందుకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో అలవికాని హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఏడాది తిరక్కుండానే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సూపర్ సిక్స్‌ను అటకెక్కించి, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంపై చంద్రబాబు దృష్టి సారించారని, పీ4 అంటూ మాయ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు మళ్లీ జగన్ పాలనే రావాలని కోరుకుంటున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై స్పందిస్తూ వారికి అండగా నిలవడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్దామని వాసుబాబు అన్నారు. మండల పార్టీ కన్వీనర్‌లు దండు రాము, సంకుసత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్తిబాబు, ఎంపీపీలు దండు రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యులు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశి, కె.జయలక్ష్మి, తుమ్మగుంట భవానీ, పార్టీ జిల్లా నాయకులు వెజ్జు వెంకటేశ్వరరావు, పుప్పాల గోపి, నాయకులు పాల్గొన్నారు.

61 రోజులు.. వేటకు విరామం

- నేటి అర్ధరాత్రి నుంచి అమలు
- సముద్ర తీరానికి చేరుకుంటున్న బోట్లు
- గతేడాది మత్స్యకార భరోసాకు కూటమి ఎసరు
- ఈ ఏడాది అయినా అమలు చేసేనా?



వేట నిషేధం కారణంగా బోట్లను తీరానికి తెస్తున్న మత్స్యకారులు

నరసాపురం: వేట బోట్లకు లంగరు పడనుంది. సముద్రంలో 61 రోజులపాటు వేట నిషేధాజ్ఞలు అమలు కానున్నాయి. ఈ మేరకు మత్స్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆజ్ఞలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు వేట నిషేధం అమలుకానుంది. ఉభయగోదావరి జిల్లాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాకు చెందిన బోట్లు నరసాపురం తీరానికి తీసుకువచ్చి లంగరు వేస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల నుంచి జూన్ 14న అర్ధరాత్రి వరకు వేట సాగించే వీలులేదు. ఈ మేరకు అధికారులు తీరంపై ప్రత్యేక నిఘా పెట్టారు.

భరోసా అందేనా?

2019 నుంచి 2023 వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం కింద ఆర్థిక సాయం చేసింది. ఏడాదికి సగటున 1,635 మందికి 5 దఫాలుగా సొమ్ములు అందించింది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఉపాధి లేక ఖాళీగా ఉంటారు. వీరి కుటుంబాలకు అండగా నిలిచేలా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా సాయాన్ని గత ప్రభుత్వం అందించింది. గత ఎన్నికల సమయంలో మత్స్యకార భరోసా మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే 2024లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గతేడాది సాయం అందించలేదు. దీంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు వేట నిషేధ సాయం అందక, మరోవైపు వరుస ప్రకృతి విపత్తులతో ఏడాదంతా సవ్యంగా వేట సాగక గంగపుత్రులు పాట్లు పడ్డారు. ఈ ఏడాదైనా కూటమి ప్రభుత్వం కనికరించి వేట నిషేధ భృతిని అందిస్తుందని మత్స్యకారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బకాయిలతో కలిపి రెండేళ్ల మత్స్యకార భరోసా సొమ్ములు అందించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించారు

- నీరుగారిన ఉమ్మడి జిల్లాస్థాయి ఆక్వా రైతుల సమావేశం
- హామీలు లేవు, కష్టాన్ని అలవాటు చేసుకోవాలంటూ సూచన
- ఆక్వా రైతులు నిబంధనలు పాటించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆదేశం



వాండ్రంలో జరిగిన ఆక్వా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: కోటి ఆశలతో సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా ఆక్వా రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. మత్స్య శాఖ, ఆక్వా రైతుల ఆధ్వర్యంలో ఆదివారం ఉండి మండలం వాండ్రం పరిధిలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఆక్వా రైతుల సదస్సులో చివరికి ఉసూరుమనిపించారు. సమావేశాన్ని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ప్రారంభించి మాట్లాడుతూ రైతుల విన్నపాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొని మాట్లాడారు. ఏం మాట్లాడినా షరతులు వర్తిస్తాయి అన్నట్టే ఉండటంతో రైతులు వాటిని ఆమోదించలేకపోయారు. మా ఉసురు పోసుకుంటారు.. అంటూ రైతులు శాపనార్థాలు పెట్టడం గమనార్హం. మేత ధరలు తగ్గించాలని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యుత్ సబ్సిడీ మాత్రం అందించడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల డిమాండ్లు

జోన్‌ల వారీగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా యూనిట్ విద్యుత్ ధర రూ.2 ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ రైతులు సమావేశంలో డిమాండ్ చేశారు. నాణ్యమైన సీడ్ అందించాలని, మద్దతు ధరలు తగ్గిపోవడంతో నష్టపోతున్నామని, ధరల స్థిరీకరణను ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్వా రంగంలో గందరగోళానికి ఫీడ్ కంపెనీలు ప్రధాన కారణమని, రైతులను నిండా ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నింటికీ ప్రభుత్వం అంటే కుదరదు

దీనిపై స్పందించిన డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తన మాటలతో రైతులను గందరగోళానికి గురిచేశారు. ఆక్వా రైతులు అడిగిన విన్నపాలకు, రఘురామ చెప్పిన సమాధానాలకు పొంతన లేకపోవడంతో రైతులు తెల్లముఖాలు వేశారు. సొంత పార్టీకి చెందిన వారు కూడా ముఖాలు మాడ్చుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆక్వా రైతులకు ఏదో జరుగుతుందని ఆశించకండి.. ప్రభుత్వాన్ని ఎంతవరకు వాడాలో అంతవరకు వాడదాం.. అన్నింటికీ ప్రభుత్వం.. ప్రభుత్వం అంటే కుదరదు.. ప్రభుత్వం అన్ని విషయాల్లో అయిపోయి ఉంది అంటూ రఘురామ చెప్పడం గమనార్హం. ప్రభుత్వ సహకారం అనే సంగతి మీ బుర్రల్లో నుంచి తీసేయాలంటూ ఆయన రైతులకు తేల్చిచెప్పారు. ప్రభుత్వాన్ని రోడ్లు వేయాలని మాత్రం అడుగుదామని అన్నారు.

అడిగినవన్నీ నెరవేరిస్తే రైతులు లేజీగా తయారవుతారు

రైతులు అడిగే కొన్ని విన్నపాలు చూస్తుంటే వాటిని నెరవేరిస్తే రైతులు లేజీగా తయారవుతారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ముందు మీకు వచ్చిన కష్టాన్ని తట్టుకుని ముందుకు వెళ్లేలా ప్రయత్నించండి అని అన్నారు. అలాగే ఆక్వా రైతులు నిబంధనలు పాటించకుండా చెరువుల తవ్వకాలు చేశారని, నిబంధనలు తప్పక పాటించాలంటూ చురకలు వేశారు. రెండు రోజుల్లో అమరావతిలో ఆక్వా రైతుల కోసం సమావేశం ఉందని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, సుబ్బరాజు, గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం



పోలసానిపల్లిలో ధర్నా చేస్తున్న ఎంపీటీసీ అంబటి దేవి, మహిళలు, యువకులు

భీమడోలు: మండలంలోని పోలసానిపల్లిలో రాష్ట్ర రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం వేకువజామున ఘోర అవమానం జరిగింది. ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు. దీంతో దళిత యువకులు, మహిళలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి బైఠాయించి ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అంబటి దేవి వారితో కలిసి నినాదాలు చేశారు. దీంతో వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భీమడోలు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో భీమడోలు, దెందులూరు ఎస్సైలు వై.సుధాకర్, సుధీర్, సిబ్బంది వచ్చి చర్చించగా ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. నిందితులు ఎంతటి వారైనా సాంకేతికత సాయంతో పట్టుకుంటామని, సంయమనం పాటించాలని సీఐ కోరడంతో ఆందోళన విరమించారు. సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు విచారణ చేపట్టగా పోలీస్ జాగిలం విగ్రహానికి పక్క రోడ్డులోని ఓ ఇంటి వద్దకు వెళ్లి ఆగింది. దీంతో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రెండు గ్రూపుల మధ్య విభేదాల వల్లే..

గ్రామంలో దళిత సామాజికవర్గానికి చెందిన వారు కొన్నేళ్లుగా రెండు వర్గాలుగా వీడిపోయారు. ఇటీవల ఓ వర్గానికి చెందిన వారు మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ విగ్రహం నిర్మాణంలో ఉండగానే మరో వర్గానికి చెందిన వారు అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి నాడు ఆవిష్కరణకు సిద్ధమయ్యారు. దీని వల్ల వారి మధ్య వివాదాలు ముదిరినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెట్టారు.

కఠినంగా శిక్షించాలి

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలకు అవమానకరమైన సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, విగ్రహాలను సంరక్షించే బాధ్యత పోలీస్, రెవెన్యూ శాఖలదేనన్నారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నేతలు అంబటి నాగేంద్ర ప్రసాద్, ముళ్లగిరి జాన్సన్, పాము మాన్‌సింగ్, దళిత సంఘం నాయకులు పైడిమాల యుగంధర్, గోవింద్, మండల జనసేన అధ్యక్షుడు ప్రత్తి మదన్ సంఘటనను తీవ్రంగా ఖండించారు.

చిల్లరతో పనేముంది!

- విస్తృతమైన డిజిటల్ నగదు చెల్లింపులు
- చిన్న చిన్న దుకాణాల్లోనూ యూపీఐ లావాదేవీలు
- శ్రీవారి హుండీ ద్వారా నెలకు రూ.10 లక్షల చిల్లర
- బ్యాంకుల్లో పేరుకుంటున్న చిల్లర



ద్వారకాతిరుమల శ్రీవారి హుండీల ద్వారా వచ్చిన చిల్లర(ఫైల్)

ద్వారకాతిరుమల: ఒకప్పుడు పెద్ద కరెన్సీ నోటు పట్టుకుని ఏ షాపుకు వెళ్లినా చిల్లర కష్టాలు తప్పేవి కావు. ఏ వ్యాపారి నోట విన్నా చిల్లర పట్టుకు రండి.. మా దగ్గర చిల్లర లేదు అన్న మాటే వినిపించేది. ఆ సమయంలో వినియోగదారులు వ్యాపారులను చిల్లర కోసం బతిమిలాడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. డిజిటల్ నగదు చెల్లింపులు వచ్చిన తరువాత చిల్లరకు కష్టాలు తప్పాయి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతర యూపీఐల ద్వారా నగదు చెల్లింపులు పెరగడమే ఇందుకు కారణం.

బ్యాంకుల్లో పేరుకుంటున్న చిల్లర

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల ద్వారా నెలకు రూ.10 లక్షల చిల్లర వస్తోంది. అందంతా స్థానిక యూనియన్ బ్యాంకుకు చేరుతోంది. ఇక్కడి నుంచి ఆ చిల్లర తాడేపల్లిగూడెంలోని సంబంధిత కార్యాలయానికి వెళ్తుంది. ప్రస్తుతం స్థానిక యూనియన్ బ్యాంకులో సుమారు రూ. 35 లక్షల వరకు చిల్లర ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు జిల్లాలోని వ్యాపారులు శ్రీవారి హుండీలు ఎప్పుడు తెరుస్తారో, చిల్లర ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూసేవారు. వాటి కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు.

చిన్న దుకాణాల్లోనూ స్కానర్లు..

నోటు చిరిగిందనే బాధ లేదు. వ్యాపారి నుంచి చిల్లర వస్తుందో.. లేదో అనే బెంగ లేదు. డబ్బు లెక్కపెట్టాల్సిన పని అంతకంటే లేదు. హైపర్ మార్కెట్ అయినా, డిపార్ట్‌మెంటల్ స్టోర్ అయినా, హోటల్ అయినా, కూరగాయల దుకాణాలైనా, ఫ్రూట్ జ్యూస్ షాపు అయినా, రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై అమ్మే కొబ్బరి బొండాలైనా, మొక్కజొన్న పొత్తులైనా, పెట్రోల్ బంకుల్లో అయినా, టీ కొట్టులో అయినా ఇలా ఏ దుకాణంలో అయినా అక్కడ క్యూఆర్ కోడ్ స్కానర్లు దర్శనమిస్తున్నాయి. వాటి ద్వారానే నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. రూపాయి పెట్టి కొనే అగ్గిపెట్టె నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారం వరకు నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయి.

ఆర్‌బీఐ ప్రోత్సాహంతో..

అన్ని బ్యాంకుల్లోనూ నూరు శాతం నగదు రహిత లావాదేవీలు జరిగేలా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా దాదాపు అన్ని వాణిజ్య, సహకార బ్యాంకులు సైతం ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పోటీ పడుతున్నాయి. ఒకప్పుడు రూ.100 కావాలంటే పనులన్నీ పక్కన బెట్టి, బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితులు లేవు. గడప దాటకుండానే నగదు రహిత లావాదేవీలు చేసుకునే అవకాశం రావడంతో ప్రజల అవసరాలు క్షణాల్లో తీరిపోతున్నాయి. సమయం ఆదాతో పాటు, జేబులో సొమ్ము పోతుందనే భయం లేకపోవడంతో వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు పడుతున్నారు.

కరోనా భయంతో..

కరోనా వైరస్ సమయంలో ఇతరులను తాకాలన్నా, వారి వస్తువులు ముట్టుకోవాలన్నా భయపడేవారు. ఈ క్రమంలో కరెన్సీ నోట్లు తీసుకుంటే కోవిడ్ సోకుతుందేమోనని ఆందోళన చెందేవారు. బ్యాంకులకు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో, నగదు రహిత లావాదేవీలు జోరందుకున్నాయి. 2020–2021 లో మొదలైన ఈ డిజిటల్ లావాదేవీలు గత మూడేళ్లలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యాప్‌ల వినియోగం పెరగడంతో ఆన్‌లైన్ లావాదేవీలు విస్తృతం అవుతున్నాయి. నగదు రహిత లావాదేవీల్లో 60 నుంచి 70 శాతం మైలు రాయిని అధిగమించాలని కొద్దినెలల క్రితం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో ఆర్‌బీఐ ఉన్నతాధికారులు సూచించారు. దీనికి అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు నగదు రహిత లావాదేవీల్లో పోటీ పడుతున్నాయి.

చిల్లర కష్టాలు తప్పాయి



యుపీఐ పేమెంట్లు చేసేవారి సంఖ్య పెరుగుతోంది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చే భక్తుల్లో 90 శాతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వినియోగిస్తున్నారు. దాంతో చిల్లర కష్టాలు తప్పాయి. గతంలో బ్యాంకు నుంచి తెచ్చి వినియోగదారులకు చిల్లర ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితులు లేవు.

– దేశెట్టి రాంబాబు, కూల్‌డ్రింక్ షాపు వ్యాపారి, ద్వారకాతిరుమల

నగదు రహిత లావాదేవీలే బెస్ట్



కూరగాయలు కొంటున్న వారిలో ఎక్కువ మంది యూపీఐనే వాడుతున్నారు. చిల్లరతో పని లేకపోవడంతో అదే బెస్ట్ అనిపిస్తోంది. షాపునకు వచ్చే పది మందిలో, ఎనిమిది మంది నగదు రహిత లావాదేవీలనే జరుపుతున్నారు. మహిళలు సైతం యూపీఐని వినియోగిస్తున్నారు.

క్షేపల్లి అభిరామ్, కూరగాయల వ్యాపారి, ద్వారకాతిరుమల

క్లుప్తంగా

శ్రీవారి ఆలయంలో కొనసాగిన భక్తుల రద్దీ



శ్రీవారి ఉచిత ప్రసాదం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం సైతం కొనసాగింది. శనివారం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు వెలువడటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు క్షేత్రానికి విచ్చేశారు. వీరికి తోడు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామికి మొక్కుబడులు సమర్పించారు. దాంతో కళ్యాణ కట్ట ప్రాంతం భక్తులతో పోటెత్తింది. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసాయి. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ

కైకలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. సమీప జిల్లాల నుంచి భారీగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండనశాల, చిన్న, పెద్ద తీర్థాలు, లడ్డు ప్రసాదాలు, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాలు, విరాళాలు ద్వారా మొత్తం రూ.83,057 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

కృష్ణభారతి సేవలు అజరామరం



కృష్ణభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

తాడేపల్లిగూడెం: స్వాతంత్ర్య సమరయోధురాలు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల కుమార్తె పసల కృష్ణభారతి సేవలు అజరామరమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇటీవల దివంగతులైన కృష్ణభారతి సంస్మరణ సభ ఆదివారం కర్రి రామచంద్రరావు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. కృష్ణభారతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు పసల కనక సుందరరావు తదితరులు హాజరయ్యారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న గుబ్బల మంగమ్మ సన్నిధి

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా వరాలిచ్చే అమ్మగా పేరుపొందడంతో మంగమ్మగుడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతీ వారం పెరుగుతూనే ఉంది. ఈ ఆదివారం కూడా మంగమ్మతల్లి గుడి భక్తులతో కిటకిటలాడింది.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కాళ్ల: భార్య కనిపించడం లేదంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కాళ్ళకూరు గ్రామానికి చెందిన పి.దివ్య(27) తన కుమారుడు మనోహర్షిత్‌తో కలిసి ఈ నెల 10న ఉదయం భీమవరంలోని కేజీఆర్‌ఎల్ కళాశాలకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాకపోవడంతో భర్త భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

దామరచర్లలో పోలీస్ పికెట్

కుక్కునూరు: మద్యం మత్తులో నలుగురి మధ్య జరిగిన గొడవ రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు ఆదివారం దామరచర్లలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం మద్యం మత్తులో దామచర్ల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. స్థానికులు వారిని వారించి గొడవ సద్దుమణిగేలా చేశారు. ఆదివారం స్థానికంగా ఉన్న పెద్ద మనుషుల మధ్య పంచాయితీ పెట్టించి రాజీ చేయించారు. ఆదివారం మధ్యాహ్నం మరోసారి ఇరు వర్గాల వ్యక్తులు మద్యం సేవించేందుకు ఒకే ప్రాంతానికి వెళ్లిన నేపథ్యంలో మళ్లీ ఘర్షణ పడ్డట్టు తెలుస్తుంది. ఓ వర్గానికి చెందిన వారు బీరుసీసాలతో మరోవర్గానికి చెందిన వారిపై దాడి చేయడంతో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. ఆ వ్యక్తి తరుపు బంధువులు రోడ్డుపై ఆందోళన చేసేందుకు సిద్ధపడగా పోలీసులు వారిని చెదరగొట్టారు. బాధితుడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో సీఐ, ఎస్‌ఐ మరో ఇరవై మంది సిబ్బందితో కలిసి దామరచర్లలో పికెట్ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు దామరచర్ల గ్రామాన్ని పరిశీలించారు.



గొడవలో గాయపడిన వ్యక్తి

పెళ్లి మండపాలకు పెరిగిన డిమాండ్

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లాలో ఏ కల్యాణ మండపం చూసినా రంగు రంగుల విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. సోమవారం నుంచి ఏప్రిల్ 20 వరకు వివాహ ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. రాత్రి ఏడు గంటలు దాటిన ముహూర్తం దగ్గర నుంచి తెల్లవారుజాము ముహూర్తాలు ఉండడంతో ఒక్కసారిగా కల్యాణ మండపాలకు గిరాకీ పెరిగింది. గూడెం ప్రాంతంలో చిన్నా పెద్దా కలిపి 20 వరకు కల్యాణ మండపాలు ఉన్నాయి. కనీస అద్దె రూ.30 వేలు ఉంటుంది. వీటికి తోడు విద్యుత్, క్లీనింగ్ చార్జీలు, డీజిల్ ఖర్చులు అదనంగా చెల్లించాలి. గూడెంలో చినతాడేపల్లి రోడ్డులో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపానికి ఖర్చులతో కలిపి రూ.5 లక్షలకు పైగా వసూలు చేస్తున్నారు. రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు మధ్యతరహా హంగులున్న కల్యాణ మండపాలకు అద్దెలు ఇస్తున్నారు. మరో వైపు బ్యాండ్ ధరలు మోత మోగుతున్నాయి. పెళ్లి కొడుకు చేయడానికి నలుగురు వాద్యకారులు కావాలంటే రూ.6 వేల వరకు ఇవ్వాల్సి వస్తోంది. తంతు జరిపించడం కోసం పురోహితులు దక్షిణలు బాగా చెల్లిస్తేనే పెళ్లిళ్లు చేయడానికి అంగీకరిస్తున్నారు. పూల డెకరేషన్‌ల ధరలు మండిపోతున్నాయి. పూల మండపానికి కనీసం రూ.17 వేలు వసూలు చేస్తున్నారు. కల్యాణ మండపానికి రూ. 60 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయాల వద్ద పెళ్ళిళ్ల చేసేవారు ఈ సీజన్‌లో పెరిగారు. పట్టణంలో సత్యనారాయణస్వామి ఆలయంలో వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీకి కనీసం రూ.60 వేల నుంచి అడుగుతున్నారు. ఈ నెలలో ఒక వారంలోనే అధిక ముహూర్తాలుండటంతో కల్యాణమండపాలు ఖాళీగా లేవు.



పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

బుట్టాయగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే పోరాటం చేయక తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ఆ సంఘం ఆధ్వర్యంలో వర్జీనియా పొగాకు రైతుల గిట్టుబాటు ధర సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం వర్జీనియా పొగాకు సరాసరి కిలోకు రూ.330 వరకూ వచ్చిందని అన్నారు. ఈ సంవత్సరం పెట్టుబడి ఖర్చులు, కౌలు రేట్లు బాగా పెరిగాయని అన్నారు. అయితే గత ఏడాది మాదిరిగా ఈ ఏడాది మార్కెట్ ధర ఉండే పరిస్థితి కనిపించడంలేదన్నారు. ఇప్పటికే వైట్ బార్లీ పొగాకు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. వర్జీనియా పొగాకు రైతులకు తగిన ధర కల్పించేలా బోర్డు అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, బొడ్డు రాంబాబు, బిక్కిన వీరసత్యం, సింహాద్రి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

టోల్‌ప్లాజా వద్ద జనసేన నేత దౌర్జన్యం



ఉంగుటూరు టోల్‌ప్లాజా వద్ద బలవంతంగా గేటు తీసి వాహనాన్ని పంపుతున్న దృశ్యం(ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉంగుటూరు మండలం జనసేన నేత స్థానిక టోల్‌ప్లాజా వద్ద తన అనుచరులతో దౌర్జన్యానికి పాల్పడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి లభించిన కారేటి జ్యోతి భర్త అయ్యప్ప తనకు చెందిన లిక్కర్ మినీ లారీని టోలు లేకుండా పంపమని ప్లాజా నిర్వాహకులను కోరారు. యెల్లో బోర్డు ఉంటే కుదరదు అని చెప్పగా తన అనుచరులు సుమారు 15 మందితో వచ్చి దౌర్జన్యంగా గేటు తీసేసి వాహనాన్ని పంపించారు. టోలు సిబ్బందిని ఇష్టం వచ్చినట్లు తిట్టి దౌర్జన్యం చేసినట్లు సమాచారం. దీంతో టోలు ప్లాజా సిబ్బంది చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి వెళ్ళినట్లు సమాచారం.

కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

అత్తిలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అత్తిలి కాలువలో ఆదివారం కొట్టుకొచ్చింది. బల్లిపాడు శివారు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేకపోవడంతో కాలువలోకి స్నానానికి దిగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని అత్తిలి పోలీసులు బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.ప్రేమరాజు చెప్పారు.



కాలువలో లభించిన వ్యక్తి మృతదేహం

బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి మందిర 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు శ్రీవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు, కల్యాణం, రథోత్సవం, వైభవోత్సవం, ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు తెలిపారు. కార్యక్రమంలో మందిర సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఇక్కట్లు

తాడేపల్లిగూడెం: ఆదివారం సాయంత్రం గూడెం ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఒకవైపు పూర్తి స్థాయిలో పంట ఎదిగి, కోతలు జరుగుతున్న వేళ కురిసిన ఈ వాన రైతులకు ఆందోళన కలిగించింది. బోర్ల కింద వ్యవసాయం చేసే గూడెం మండలంలో చినతాడేపల్లి నుంచి బంగారు గూడెం వరకు దాదాపుగా మాసూళ్లు పూర్తయ్యి, ధాన్యం అమ్మకాలు అయ్యిపోయాయి. మాధవరం ప్రాంతంలో కూడా మాసూళ్లు పూర్తిచేసుకుని రైతులు ఒబ్బిడి అయ్యారు. ఈ మండలంలో సుమారు 25 వేల ఆయకట్టులో వరి వేశారు. కాలువ కింద గ్రామాలైన కృష్ణాయపాలెం నుంచి నవాబుపాలెం, నందమూరు వరకు ఇంకా కోతలు ప్రారంభం కాలేదు. సుమారు 18 వేల ఎకరాల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. నిటారుగా నిలబడే 1121 రకం కావడంతో ఆదివారం కురిసిన వానతో పంటకు పెద్దగా నష్టం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పనల మీద ఉన్న ధాన్యానికి కూడా అకాల వాన వల్ల ఇబ్బంది లేదు. పెంటపాడు మండలంలో సుమారు 21 వేల ఎకరాల ఆయకట్టులో వరి వేశారు. దీనిలో రెండు వేల ఎకరాల వరకు కోతలు పూర్తయ్యాయి. 19 వేల ఎకరాల్లో ఇంకా కోతలు పూర్తి కావాల్సి ఉంది. ఆదివారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వాన పడటంతో రైతులు కంగారు పడ్డారు. కొద్ది సేపు వర్షం పడి ఆగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వాన వల్ల పంటకు ఎలాంటి ఇబ్బంది లేదని తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకుడు మురళీకృష్ణ తెలిపారు. గూడెం పట్టణంలో వానతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద దీరారు.

ఏజెన్సీలో గాలివాన బీభత్సం

బుట్టాయగూడెం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షంతో పాటు గాలి బీభత్సం సృష్టించింది. పలు చోట్ల కొమ్మలు విరిగిపోయాయి. గాలులకు కరెంటుకు అంతరాయం కలిగింది. రాత్రి 8 గంటల వరకూ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

కుక్కునూరులో ఈదురు గాలులతో వర్షం

కుక్కునూరు: కుక్కునూరు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలంగా వీచిన గాలుల దాటికి మండలంలోని చిరవెల్లి గ్రామంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా గాలుల దాటికి మండల వ్యాప్తంగా విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.



గూడెం పట్టణంలో రోడ్లపై నిలిచిన నీరు



బుట్టాయగూడెంలో ఈదురు గాలులకు చెట్లు వాలిన దృశ్యం



చిరవెల్లిలో ఈదురు గాలుల ధాటికి విరిగిపడిన తాటిచెట్టు

జూనియర్ లెక్చరర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ఏలూరు జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా జి.భక్త హనుమాన్, కార్యదర్శిగా వి. శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు సంఘ ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే ఖాసింపీర, సంయుక్త కార్యదర్శిగా కేకేఎస్ జనార్ధన రావు, కోశాధికారిగా కే. సమత తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జి.సందీప్, పరిశీలకునిగా అయినపర్తి మురళీకృష్ణ వ్యవహరించారు.

భక్తులకు నీడ కోసం



సప్తగోకుల ప్రాంతంలో నిర్మిస్తున్న పందిళ్లు

ద్వారకాతిరుమల: భక్తులకు భానుడి భగభగల నుంచి ఉపశమనం కల్పించేందుకు ఆలయ అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు. ఆలయ తూర్పు వైపున సప్తగోకుల ప్రాంతంలో ఆదివారం పందిళ్ల నిర్మాణం చేపట్టారు. వెదురు బద్దలతో తయారు చేసిన మ్యాట్లను పైకప్పుగా వేస్తున్నారు. ఇవి భక్తులకు నీడతో పాటు, చల్లదనాన్ని కలిగించనున్నాయి. మండు వేసవిలో భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు చేపడుతున్న చర్యలను భక్తులు ప్రశంసిస్తున్నారు.



పైకప్పుకు వెదురు మ్యాట్స్ సిద్ధం చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

పేద మహిళకు ఆర్థిక సాయం



వెంకటలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నా జనార్ధనరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి భర్త ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త చనిపోవడంతో ఆమెను ఆదుకునేందుకు గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు చెన్నా త్రికళ ముందుకొచ్చారు. ఆమెకు దాతల సహకారంతో నెలకు రూ.8 వేలు చొప్పున మూడు దఫాలుగా అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఆదివారం రూ.8 వేలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నా జనార్ధనరావు ఆమెకు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీటీసీ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మనాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యానాదుల కాలనీకి చెందిన వృద్ధులకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వర్ర కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కపర్ది, కాశి, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు



ఉచిత వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా వైద్యసేవలందించారు. ప్రముఖ సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనం ద్వారా నలుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఉచిత వైద్యసేవలు అందజేశారు. సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ప్రతి ఆదివారం ఈ ఉచిత వైద్యసేవల కోసం 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నందమూరులో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటి వారు తెలిపారు. ఆలయ ధర్మకర్త దేవులపల్లి సుబ్బారావు, అరసాల సుబ్బారావు, మాజీ సర్పంచ్ యామన సత్యనారాయణ, ఆలయ కమిటి సభ్యులు అరసాల రాంబాబు, దార్లంక శ్రీనివాస్, మామిడి శంకరం, మంగళ సూరిబాబు, తాతకుంట్ల వీరవెంకటరమణ, శనగర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేదర్లకు సంక్షేమ పథకాలు అందించాలి



మేదర సంఘ సభ్యులతో జిల్లా నాయకులు

అత్తిలి: మేదర్లకు అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆకివీడు గ్రామానికి చెందిన మేదర సంఘ నాయకులు కేశవరావు కోరారు. ఆదివారం అత్తిలిలో మేదర సంఘ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. త్వరలో జిల్లా మేదర సంక్షేమ సంఘం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మేదర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాపెల్లి వెంకటేశ్వరరావు, అత్తిలి మేదర సంఘం అధ్యక్షులు కొండా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- వారం నుంచి క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా రహదారులు
- పెరిగిన విద్యుత్ వినియోగం



తణుకులో వేసవి వేడి గాలులకు నిర్మానుష్యంగా మారిన ఆర్వోబీ ప్రాంతం



రాష్ట్రపతి రోడ్డులో ఎండ వేడికి రాకపోకలు తగ్గిన వైనం

తణుకు అర్బన్: భానుడి భగభగలతో జనం బెంబేలెత్తుతున్నారు. సూర్యతాపానికి ప్రయాణికులు తమ ప్రయాణాల్లో విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా శనివారం నుంచి వేసవి గాల్పులు మొదలు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మేనెలలో వచ్చే వడగాల్పులు ఏప్రిల్ నెలలోనే రుచిచూపించడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడి వాతావరణం మొదలవుతుండడంతో వ్యాపార, ఉద్యోగపరంగా బయటకు వచ్చే ప్రజానీకం ఇవేమి ఎండలురా దేవుడా అంటూ చెట్ల కింద కూలబడిపోతున్నారు. ఈ వేసవిలో ఇప్పటి వరకు లేని విధంగా శనివారం ఏకంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజానీకం ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. రహదారులపైనే కాకుండా ఇళ్లలోనే ఉండలేకపోతున్నామంటూ ఆందోళన చెందుతున్నారు.

నిర్మానుష్యంగా రహదారులు..

తణుకు పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రాష్ట్రపతి రోడ్డు శనివారం రోజున వేడి గాల్పుల దెబ్బకు నిర్మానుష్యంగా మారింది. మధ్యాహ్నం 11 గంటల నుంచే ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. వేల్పూరు రోడ్డు, సొసైటీరోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, స్త్రీసమాజం రోడ్లు నిత్యం వాహనాల రద్దీతో కిటకిటలాడే పరిస్థితి ఉండగా ఎండవేడికి భయపడి ప్రయాణాలు కూడా వాయిదాలు వేసుకోవడంతో రహదారులు జనసంచారం లేకుండాపోయాయి.

గతంలో కారుమూరి ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలు..

ఎండవేడికి ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందసేవా సంస్థలు, సామాజిక స్పృహ కలిగిన వారు మాత్రమే కొన్నిచోట్ల చలివేంద్రాలు ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేసవి వస్తుండగానే తణుకు పట్టణమే కాకుండా నియోజకవర్గంలోని గ్రామాల్లో సైతం ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు కారుమూరి ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం తరపున కానీ, ప్రజాప్రతినిధులు కానీ చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు.

గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..	
12వ తేదీ..	37 డిగ్రీలు
11వ తేదీ..	34 డిగ్రీలు
10వ తేదీ..	35 డిగ్రీలు
9వ తేదీ..	33 డిగ్రీలు
8వ తేదీ..	33 డిగ్రీలు
7వ తేదీ..	35 డిగ్రీలు
6వ తేదీ..	36 డిగ్రీలు

ఎండలు దంచికొడుతున్నాయి...



మేనెల రాకుండానే వడగాల్పులు మొదలు కావడంతో ప్రజానీకం భయపడిపోతున్నారు. ఇళ్లలోంచి బయటకురావాలంటేనే భయపడే పరిస్థితులు ఏప్రిల్ నెలలోనే వచ్చేసింది. వేడి గాలుల తాకిడికి వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఉక్కపోత పరిస్థితుల్లో ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు దాహార్తిని తీర్చే చలివేంద్రాలు లేకపోవడంతో తమ ప్రయాణాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చలివేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలి.

– షేక్ జిలాని, తణుకు

కూటమి హామీలు అమలు చేయాలి



ఇళ్ల స్థలాల సాధన కమిటీతో సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇళ్ల స్థలాలపై ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నాల్గో వార్డులో నిర్వహించిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఇళ్లు లేని నిరుపేదలతో స్థలాల సాధన కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని చెప్పారని నేటికీ అమలు చేయలేదన్నారు. ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షురాలిగా దుర్గా భవాని, కార్యదర్శిగా కె.,రాణి, మరో 8మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు.

మట్టల ఆదివారం వేడుకలు

అత్తిలి: మండల వ్యాప్తంగా మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలను పుష్పాలతో అలంకరించిన విశ్వాసులు గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంబడి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈస్టర్‌కు ముందు వారం వచ్చే ఆదివారం మట్టల ఆదివారంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఒకే సంఘంగా ముందుకు సాగాలి



సమావేశం నిర్వహిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ విశ్వ బ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉషా గ్రాండ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు జీకే ఆనంద్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నక్కా చైతన్య శ్రీనివాస్ నిర్వహణలో రాష్ట్ర సంఘం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒకే సంఘం, ఒకే నాయకత్వంతో ముందుకు సాగుద్దామని చెప్పారు. తొలుత విశ్వకర్మ పోతులూరి వీరేబ్రహ్మేంద్రస్వామిని పూజించారు. విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వృత్తి సంఘ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో కుందుర్తి గురవాచారి, మేడిపి ప్రసాద్, గోకవరపు శ్రీనివాస్, రాయల రాము, బి.వెంకట శేషాచార్యులు, 23 జిల్లాల నుంచి వృత్తి సంఘాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటి ప్రచారం ఆదివారం ప్రారంభించారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులున్నాయని, వత్తిడి లేని నాణ్యమైన విద్యను అందించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీఎస్ నారాయణ (విక్రమ్) చెప్పారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వచ్చే సదుపాయాలు, విద్య, భవిష్యత్ పరిణామాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కార్పొరేట్ కన్నా మిన్నగా విద్యా బోధనను ఆంగ్లంలో అందజేస్తున్నామని వివరించారు. పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. యూటీఎఫ్ మండల జనరల్ సెక్రటరీగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న ధృఢ సంకల్పంతో ఈ చర్యలు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.

కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లను అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

కాళ్ల: మానవత సేవా సంస్థ, భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో బొండాడ గ్రామంలో ఆదివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మార్చి 26న గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మందికి ఆపరేషన్ చేయించి, అవసరమైన 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అందించామని సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ మాట్లాడుతూ పరమహంస యోగానంద నేత్రాలయ సంస్థ వేమగిరి, రాజమండ్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 150 మంది కంటి పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో–చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వర ప్రసాద్, డైరెక్టర్ వడ్డి వెంకటేశ్వరరావు, క్యాంపు కో–ఆర్డినేటర్ పెన్మెత్స రంగరాజు, చెరుకువాడ మహంకాళి, గూడె సుబ్బారావు, మందపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

తణుకు అర్బన్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తణుకు తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించి అత్యున్నత మార్కులు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను విద్యార్థులు వీఆర్ అభినయ, డి.శ్రీవల్లి, బిఎల్ సాయి కుసుమ, ఎస్.లావణ్య, జె.లలితా దేవి, సీహెచ్‌వీ సాయి ప్రజ్ఞ, డీజీవీ దుర్గా మల్లిక, పీఎల్‌కే సాయి సౌమ్య, కె.నాగగాయత్రి 466 మార్కులు చొప్పున సాధించినట్లు చెప్పారు. 99.5 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగాను ఎం.నజ్మ 435, డి.ఆశ్రిత శ్రీదుర్గ, 434 మార్కులు సాధించార్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ నున్న తిరుమలరావు అభినందించారు. కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాద్, విద్యాసంస్థల టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఆరవల్లి విద్యార్థుల హవా



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

అత్తిలి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 71 శాతం, ద్వితీయ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించారని వి.అనంతలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో తాడి నాగ ఉమామహేశ్వరి 446 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. బైపీసీలో యార్లగడ్డ సుస్మిత 291 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో కడలి నందిని 847 మార్కులు, గొలుగూరి హారికదుర్గ 769 మార్కులు సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా కమిటీ చైర్మన్ వెలగల సత్యారెడ్డి, హెచ్ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో సెంట్‌ఆన్స్ విజయకేతనం



ఆర్.చంద్రిక (985)



ఎం.లీలా శివ సాయి (982)



ఎం.శరత్ శోభిత (464)



వి.గీతామాధురి (460)

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ 2025 పరీక్షా ఫలితాల్లో సెంట్‌ఆన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్‌లో ఆర్.చంద్రికి 985, ఎం.శివసాయి 982, జూనియర్ ఇంటర్‌లో ఎం.శరత్ శోభిత 464, వి.గీతా మాధురి 460 మార్కులు సాధించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో సెంట్‌ఆన్స్ విద్యా సంస్థల చైర్మన్ అద్దంకి విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆర్.పి.రెడ్డి, స్టాఫ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుంత దారిపై కూటమి కక్ష

- వైఎస్సార్ సీపీకి అనుకూలమని తూరల తొలగింపు
- ధాన్యం వచ్చే దారి లేక రైతుల ఇక్కట్లు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టని వైనం



డ్రెయినేజీ తవ్వకం పేరుతో తూరలు తీసి వేసిన దృశ్యం

పెంటపాడు: వైఎస్సార్ సీపీకి ఓటు వేసానని, పార్టీకి అనుకూలంగా ఉన్నానన్న కక్షతో తన పొలానికి వెళ్లే దారి పుంత తూరలు డ్రెయిన్ తవ్వకం పేరుతో కూటమి నాయకులు తొలగించారని విప్పర్రుకు చెందిన రైతు తోరం వెంకట సుబ్బయ్య ఆవేదన వెళ్ల గక్కారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, కనీసం సంఘటనా స్థలాన్ని పరిశీలించలేదని రైతు సుబ్బయ్య వాపోయాడు. గత వారంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రైతు సుబ్బయ్యతో పాటు, ఆయన కుమారుడు అప్పారావుల ఆవేదన ఇది. వివరాలు ఇలా ఉన్నాయి. పెంటపాడు మండలం పడమరవిప్పర్రుకు చెందిన రైతు తోరం వెంకట సుబ్బయ్య, తనకుమార్తె అయిన సాధనాల విజయశాంతికి పసుపు, కుంకుమ కింద 0.60 సెంట్ల వ్యవసాయభూమి ఇచ్చారు. అయితే అల్లుడు రవి ఇటీవల మృతి చెందడంతో ఆ భూమిని సుబ్బయ్య మగతా చేసి కుమార్తెకు పంట సొమ్ము అందజేస్తున్నారు. కాగా ఒక వారం క్రితం కూటమి నాయకుల ప్రోద్బలంతో చినపందికోడు డ్రెయిన్‌ను అధికారులు పూడిక తీత పనులు చేపట్టారు. పొలాలకు వెళ్లే దారి అడ్డుగా లేకున్నా ఎంతో కాలం నుంచి రహదారి పుంతగా ఉన్న తూరలను తమకు చెప్పకుండా తొలగించారు. కాగా ఈ దారి తమకే కాకుండా సుమారు 100 ఎకరాలు సాగు చేసుకొనేందుకు రైతులకు పుంత దారి అని పేర్కొన్నారు. అయితే పంట చేతికి వచ్చిన తరుణంలో రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కోత మిషన్ వెళ్లేందుకు, దమ్ము ట్రాక్టర్ వెళ్లేందుకు దారి లేకుండా చేశారు. రెండు రోజులలో చేలు కోత కోయించాలి. ధాన్యం వచ్చేదారిలేదు. తన పొలానికి దారి చూపాలని, తొలగించిన తూరలు మళ్లీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. విషయంపై స్పందనలో ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని రైతులైన తండ్రీ కొడుకులు కోరుతున్నారు.

వంతెనల యాతన ఇంకెన్నాళ్లు?

- నరసాపురంలో శిథిలస్థితికి చేరిన వంతెనలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శిథిలావస్థలో ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డులోని మేదర్ల వంతెన

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతెనల పరిస్థితి ప్రమాదకరంగాఉన్నా కూడా ఆర్ అండ్‌బీ అధికారులు వంతెనల పునర్నిర్మాణం విషయంలో దృష్టిపెట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు చాలా ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉన్నా కూడా అధికారులు ఆ అంశంపై కూడా దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నరసాపురం–పాలకొల్లు రోడ్డులోని మత్స్యపురి వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఓ వైపు రిటైనింగ్ వాల్ కూలిపోయింది కూడా. నిత్యం ఈ వంతెనపై అనేక బస్సులు, లారీలు వెళ్తూ ఉంటాయి. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ఈవంతెనకు ఎప్పుడో 20 ఏళ్లక్రితం మాత్రమే మరమ్మతులు చేశారు.

రైల్వేస్టేషన్ రోడ్డు వంతెన దుస్థితి ఇలా

రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకోవడానికి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. మేదర్ల బ్రిడ్జిగా పిలిచే ఈ వంతెన నిర్మించి 50 సంవత్సరాలు అవుతోంది. రైల్వేస్టేషన్ వద్ద నుంచి బైపాస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఇటీవల కాలంలో మేదర్ల బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్ భారీగా పెరిగింది. ఈ వంతెనను కొత్తగా బలంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం వెళ్లే దారిలో కాలువపై వంతెన కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 1500 ఎకరాల ఆయకట్టు రైతులు ప్రతిరోజూ ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ప్రభుత్వాసుపత్రి వద్ద వున్న కాలిబాట వంతెన ఏ మరమ్మతులకూ నోచుకోలేదు. అధికారులు, పాలకులు వంతెనల పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు



ప్రభుత్వానికి అభివృద్ధిపై దృష్టి ఉండటంలేదు. నరసాపురం పట్టణంలో ప్రధాన వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. మత్స్యపరి వంతెనను మరమ్మతులు చేసి 25 ఏళ్లు దాటుతుంది. ఇక రైల్వేస్టేషన్‌కు వెళ్లే మేదర్ల వంతెన పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇటీవల ఈ రూట్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే బస్సులు కూడా ఈ మార్గంలోనే వెళ్తున్నాయి. ఈ వంతెనను పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలి.

– ముచ్చర్ల త్రిమూర్తులు, సీపీఎం పట్టణ కార్యదర్శి

ఈ వేసవిలోనైనా అభివృద్ధి చేయాలి



ఈ వేసవి కాలంలోనైనా వంతెనలు మరమ్మతులు, కొత్త వంతెనల నిర్మాణాలు చేయాలి. కానీ రోడ్లు, భవనాల శాఖ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకున్నట్టుగా కనిపించడం లేదు. ఉన్న వంతెనలు శిథిలమవుతున్నాయి. ఇప్పటి నుంచే వంతెనల అభివృద్ధిపై చర్యలు చేపట్టకపోతే ఇబ్బందులు తప్పవు. ప్రజలు నానా ఇబ్బందులుపడతారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కళ్లు తెరిచి వంతెనల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

– కడలి పెద్దిరాజు, నరసాపురం

ధ్యానంతో మెరుగైన ఆరోగ్యం



ఉచిత ధ్యాన శిక్షణలో పాల్గొన్న సాధకులు

వీరవాసరం: ప్రతి రోజూ ధ్యానం చేస్తే మెరుగైన ఆరోగ్యం పొందొచ్చని పిరమిడ్ మాస్టర్ లక్ష్మణ్ అన్నారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీతారామ దేవస్థానంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం పిరమిడ్ మాస్టర్లు, భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మామిడి లక్ష్మణ్ ధ్యాన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మామిడి లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం సర్వరోగ హరిణి, ధ్యానం సకల భోగకారిణి, ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని అని తెలిపి ధ్యానసాధన ద్వారా తన జీవితంలో జరిగిన మార్పులను తెలిపారు. ధ్యానంతో పాటు శాకాహారం తినాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. అనంతరం సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడిశెట్టి కృష్ణారావు, ఉదయ్, వర్రె విశ్వేశ్వరరావు, కృష్ణవేణి, యడ్ల నాగమణి, విజయలక్ష్మి, మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.